# 39. డన్‌లప్ మతలబ్

మెజీషియన్స్ ప్రదర్శించే 'ఎక్స్‌రే కళ్ళు' అనే ఐటమ్ మీరు చూసే ఉంటారు. మరి కనబడకుండా ఎంత గట్టిగా కళ్ళు కట్టెయ్యడానికి వీలుంటుందో అంత కట్టుదిట్టంగా ఎవరో ప్రేక్షకుడి చేత మెజీషియన్ కట్టించుకుంటాడు. అయినా ఆ లోపల్నుంచి ఆయన చూడలేనిదంటూ ఉండదు. బోర్డు మీద చాక్‌పీస్‌తో మనం ఏం రాస్తే అది మామూలు కళ్ళతో చూస్తున్న నేర్పరితనంతో ఆ పక్కనే రాసేస్తాడు! ఇంతెందుకు, గాంధారిని తలదన్నే కళ్ళ పట్టీ బిగించుకుని మాంచి రద్దీగా ఉన్న సిటీ జంక్షన్స్‌లో యమా స్పీడుతో స్కూటరు తొక్కే మాయదారి సాహసికుల్ని నేను స్వయంగా చూశాను!

"కళ్ళున్నా మేం చెయ్యలేనిది కళ్ళు మూసుకుని మీరు అవలీలగా చేసేస్తున్నారు. ఏమిటిందులో కిటుకు? అని అడిగాను కూడాను. "కిటుకు చెప్పేస్తే మా బతుకేం కావాలి బ్రదర్! ఒక్కటి మాత్రం చెబుతాను. ఏ ప్రతిభకయినా నిరంతర సాధన అవసరం" అని జవాబు. నాకు తెలిసిన ఆ మెజిషియన్ ఎమ్మే పాసయ్యాడు. రెగ్యులర్ ట్రెయినింగ్ కూడా కావాలంటున్నాడు. ఇటు ఎటువంటి చదువూ లేక, అటు సాధనా కనబడని కొందరు సాధారణ జనం కూడా ఒక్కొక్కప్పుడు అసామాన్యమైన సూక్ష్మబుద్ధి ప్రదర్శిస్తూ ఉంటారు. అలాంటి చిన్న సంఘటన ఒకటి చెబుతాను. ఇంతకు మించిన మరో మంచి పని మీకు అందుబాటులో లేకపోతే ఈ ఉదంతం ఆసాంతం వినండి.

ఆమధ్య కొన్నాళ్ళపాటు నే నో పత్రికలో ఓ డిటెక్టివ్ శీర్షిక నిర్వహించాను. తనకి చదువు లేకపోయినా తహ తహ కేం లోటు లేదు గనుక మా పార్వతమ్మ పిన్ని అవన్నీ నాచేత చదివించుకుంటూ ఉండేది. కళ్ళు మూసుకుని ఆలోచిస్తూ ఏవేవో ఎత్తి చూపి నన్ను ఆట పట్టిస్తూ ఉండేది. టైమ్స్‌లో వచ్చిన ఓ విచిత్రాన్ని ఆధారం చేసుకుని రెణ్ణెళ్ళ క్రితం అనుకుంటాను, 'ఏనుగు పిల్లని ఎత్తుకుపోయారట!' అనే కథ రాశాను. ఎప్పట్లా చదివి వినిపిస్తే పిన్ని చేసిన విమర్శ మరచిపోలేను. ఎవళ్ళో జమీందార్లమ్మాయి 'జూ'లోని ఏనుగుపిల్లని చూసి సరదా పడి ఎంతైనా కొందామని చూస్తుంది. వాళ్ళు అమ్మకపోతే దొంగతనం చేయించబోయి దొరికిపోడం కథ సారాంశం. "అంత నెలల పిల్లే అంత బరువు ఉండడం, ఆ శరీరం మీద చెయ్యి వేస్తే ఆ లేత వయసులో మెత్తగా, నున్నగా జారిపోతూ....... అబ్బ! ఆ అనుభవం వర్ణించలేం" అని నేను చదువుతూంటే.......

"అవును వర్ణించలేం......... అలాంటి అనుభవం అసంభవం" అని పకపకా నవ్వేసింది పిన్ని.

"ఆ ఇంగ్లీషు మాగ్జయిన్‌లో ఓ పులి పిల్లని సర్కస్ నుంచి ఎత్తుకుపోతారు. అలాగే రాస్తే బొత్తిగా కాపీలా బయటపడిపోతుందని జూ నుంచి ఏనుగు పిల్లని తరలించారని మార్చాను. ఏం, ఏం తప్పొచ్చిందీ?"

"తప్పేం రాలేదనుకో నీ దృష్టికి. పులులూ, ఏనుగులూ మనం ఎలాగా దొంగలించలేం.

ఆఖరికి ఆ భావమేనా సొంతం చేసుకునే దొంగబుద్ధి పట్టు పడింది కాదు కదా అని నా విచారం!" అంటూ, నోటికి పమిటచెంగు అడ్డేసుకుంది.

"నవ్వు కట్టిపెట్టి అసలు విషయం చెబుతావా, చెప్పవా?" అని నిలదీసి చెప్పించా నెలాగో.

"ఆ లేత వయసులో మెత్తగా, నున్నగా అని వర్ణించావే అది శుద్ధ తప్పు" అంటూ, విశదీకరించింది పార్వతమ్మ పిన్ని. ఏనుగు పిల్ల ఒళ్ళు నున్నగా ఉండదుట. ఒంటినిండా రోమాలూ అదీ మహా గరుకుగా, కాకరకాయలా ఉంటుందిట ఆ గజ కిశోరి తనూ విలాసం! పట్టుదల కొద్దీ ఆ మర్నాడు సెలవు పెట్టి జూకి వెళ్ళి వెరిఫై చేసి చూద్దునూ, పిన్ని చెప్పింది రైటే!

అక్కడితో ఊరుకుంటే ఆవిడ గొప్పేం కాను! ఏనుగు పిల్ల అనే పద ప్రయోగం కూడా తప్పేనుట. "ఏ పిల్లి సంతానమో అయితే పిల్లి పిల్ల అంటాం. ఏనుగు గున్న అనాలి గాని, ఏనుగు పిల్ల అంటామా ఎక్కడైనా? ఇలా తన బిడ్డని అవమానించారని ఆ గజమాత చేటచెవిని చేరిందో ఆ రచనతోపాటు రచయితనీ చుట్టచుట్టి తొండంతో ఎత్తిపెట్టి అవతల పారెయ్యకపోయేనా?" అనే వేళాకోళం ఒకటీ! పదునైన బుద్ధే ఉంటే పరీక్షలు పాసవడందేనికి అనిపిస్తుంది పార్వతమ్మ పిన్ని లాంటి వాళ్ళని చూస్తుంటే! పరిణతి గల పరిశీలనా శక్తే ఉంటే సాధన అనేది అవసరమా అనే ప్రశ్న కూడా పుట్టకపోదు. పరిచయం అంటూ అయిపోయింది గనక, హస్కు చాలించి, అసలు విషయంలోకి వస్తాను.

మా దూరపు బంధువులు ఒకరింట్లో పెళ్ళయితే మేమిద్దరం వెళ్ళాం. పెళ్ళికూతురు సుబ్బలక్ష్మికి నోటిలోని పళ్ళెన్నో ఒంటిమీద ఏళ్ళూ అన్నే. ఓ రెండు తగ్గించి చెబుతారు గాని, ఏ ముప్పై అయిదో అనిపిస్తుంది చూస్తే తెల్లనిదీ, చదువుకున్నదీ, ఆస్తీ అందమూ ఉన్నదీ, అయితేనేం, ఆడది కదా! కట్న రూపంలో జరిమానా ఇవ్వక తప్పలేదు. ఆ పిల్ల తండ్రికి ఎందుకివ్వాలో బోధపడలేదు. ఆ సంగతి తెలిసి లెంప లేసుకునేసరికి పిల్ల కాస్తా ముదిరిపోయి అపరాధ సుంకం అర లక్ష దాటింది.

ఇలా నే సేకరించిన భోగట్టాలు చెవిని వేస్తూ పిన్నితో అన్నాను. "ఆలస్యమయితేనేం, అయిందనిపించి ఒడ్డెక్కిపోయాడు. ఇక ఆ కొడుకు పెళ్ళి మిగిలింది. జబరుగా ఎదిగాడు గాని వాడికి ఇరవై మూడుట. వాడి పెళ్ళి చేస్తే ఆ బాధ్యతా అయిపోతుంది గాని, అదే అయిదేళ్ళ నాటి మాటో......."

"నీకా సందేహం అనవసరం. ఆర్నెల్లు దాటకుండా శుభలేఖ వస్తుంది చూడు" అని పిన్ని చెబుతూంటే తెల్లబోయి చూశాను. మునపటి రోజుల్లో అయితే ఆవిడన్న మాటకి వెంటనే ఆవేళకి నోటి కేదొస్తే అది అనేసేవాణ్ణి. ఆవిడ తెలివితేటలు పసిగట్టిన నా మనసు మరీ అంత తొందరగా ఫూల్‌ని అనిపించుకోడానికి ఈ మధ్య ఇష్టపడ్డం లేదు. కాస్త ఆలోచించాను. ఆడాళ్ళు మాట కలపడంలోనూ, కూపీలు లాగడంలోనూ సిద్ధహస్తులు. మంచి సంబంధం ఏదో జత పడిందని విని ఉంటుంది. తెలివిగా వివరాలు సంపాదించి ఉంటుంది. ఏదైనా నా అనుభవం చెప్పిన పాఠం ఒకటుంది. పార్వతమ్మ పిన్ని కబురుకి మాత్రం తిరుగుండదు. ఇంతకీ ఈవిడకంటె కన్యాదాత కనకరాజు నాకే దగ్గర. వెళ్ళి అడిగేశాను. ఆయన మొదట్లో తెల్లబోయి తరువాత "వాడి పెళ్ళి కిప్పట్లో ఏం తొందరా,

ఎలా పుడతాయో ఇలాంటి పుకార్లు!'' అనేశాడు.

మేం తిరిగి వచ్చేశాక పనుల ఒత్తిడిలో ఆ కబురే మరచిపోయాను. అయిదో నెలనాడు పార్వతమ్మ పిన్ని చెప్పినట్లు శుభలేఖ రానే వచ్చింది. "ఎలా చెప్పగలిగావు తల్లీ ఇంత సరిగ్గా, ఇంత ముందుగా!'' అని ఆవిడ రెండు చేతులూ పట్టుకున్నాను. పిన్ని ఓ విశేషం గుర్తు చేసింది.

మేం వాళ్లమ్మాయి పెళ్లి కెళ్లినప్పటిమాట కనకరాజుగారి క్వార్టర్సు వీధి గదిలో ఓ పక్కగా ఓ పెద్ద బల్లమీద ఒక దానిమీద ఒకటి పేర్చిన నాలుగు డన్‌లప్ బెడ్స్ దొంతర మా మాటల్లో దొర్లింది. "ఎంత డబుల్ కాట్ అయినా రెండు పరుపులు పెళ్ళికూతురికీ, పెళ్ళికొడుక్కీ సారెగా ఇచ్చుకోవచ్చు గాని, ఏకంగా నాలుగు దేనికో!'' అనే సందేహం పిన్ని వెళ్ళగక్కింది.

"చాల్లే పిన్నీ! కోడి గుడ్డుకి వెం(ట్రుకలు పీకే మనస్తత్వం నీలో పెరిగిపోతోంది. నాలుగూ ఓసారి కొంటే చవకగా వచ్చాయేమో! మరెవరికని అయినా కొన్నాడేమో! లేదా కనకరాజుగారు ముచ్చట పడి తమకోసమే ఒక జత అట్టే పెట్టుకున్నారేమో!'' అంటే అప్పటికి ఊరుకుంది, అవేవీ రుజువుకి నిలబడే జవాబులు కావని తనకి అప్పుడే తెలుసునట. మరెవరికో అనుకొనే స్వభావం ఆయనలో మచ్చుకైనా లేదట. కనకరాజుగారి భార్యకి మొదట్నుంచీ నడుంనొప్పి అనీ, పెద్దాపరేషన్ అయిందనీ, డన్‌లప్ బెడ్ మీద పడుకుంటే ఆవిడకి పోట్లు వస్తాయని పిన్నికి తెలుసట. "ఇంకెవరికీ - కొడుకు కోసమే కొని ఉంటాడు' అనే నిర్ణయానికి వచ్చి వాణ్ణి వేరే పిలిచి "ఏంరోయ్ నీ పెళ్ళి కూడా నిశ్చయమైందటగా, నేనెవరితోనూ చెప్పన్లే. (ప్రేమ పెళ్ళా?'' అని అడిగిందట. వాడు 'అవు'నని చెపుతూ, 'జుబేదా' అనే ఆ ముస్లిమ్ ముద్దరాల్ని దూరం నుంచి ఆవిడకి చూపించాడుట కూడా!

ఆవిడ సూక్ష్మబుద్ధికి జోహారు చేస్తూ "మరి ఆ సంగతి ఆ రోజే ఆయన చెప్పొచ్చుదగా?'' అనడిగాను.

"కట్నం ఇవ్వనని కొన్నాళ్లపాటు బిగిసినందుకు కనకరాజు కూతురికి ఓ పట్నాన సంబంధం కుదర్చలేకపోయాడు. కుర్రాడు ఎంతతొందరపడినా ముందుగా ముస్లిమ్ కోడల్ని తెచ్చుకుంటే, ఆ కూతురికి జన్మలో పెళ్ళవుతుందా? చెడిపోయిన సమాజంలో బతకాలంటే కొన్ని మంచి నిర్ణయాలు కూడా కొంతకాలంపాటు దాచవలసి వస్తుంది మరి!'' అంటూ ముగించింది ఆవులిస్తూ, ఆవలిస్తే పేగులు లెక్కెట్టే మా పార్వతి పిన్ని.

★